క్లుప్తంగా

సాగుపై అవగాహనతో సత్ఫలితాలు



అక్కివరంలో వరి పొలాన్ని సందర్శిస్తున్న అధికారులు, రైతులు

డెంకాడ: పంటల సాగుపై రైతులకు అవగాహన కలిగి ఉండటం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ఏఓ పూడి నిర్మల అన్నారు. మండలంలోని అక్కివరం, గొలగాం రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశలో ఉందన్నారు. అందువలన ఎకరాకు 25 కేజీల యూరియా, 25 కేజీల పొటాష్ వేయాలన్నారు. కార్యక్రమంలో అక్కివరం సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, రైతులు, వీఏఎస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి వాస్తవమే...

● మంత్రి కొండపల్లి

విజయనగరం రూరల్: ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరగడం వాస్తవమేనని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. జరిగిన అభివృద్ధిని పక్కనపెట్టి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. వీలైతే ప్రభుత్వానికి సహకరించి ముందుకు నడవాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ జిల్లాకు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. వంద రోజుల్లో పెన్షన్ పెంచడమే కాకుండా అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థను నీరుగార్చకుండా మరింత పటిష్టపరుస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు టీడీపీ నాయకులు ప్రసాదుల రామకృష్ణ, మక్కువ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

నిధులను మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: ప్రభుత్వం మంజూరు చేసే నిధులను మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించాలని ఎంపీపీ అంబల్ల సుధారాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించనున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని, అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథం, ఏఓ సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం పన్ను వసూళ్లు జరగాలి



పన్ను వసూళ్లను పర్యవేక్షిస్తున్న కమిషనర్

నెల్లిమర్ల: నగర పంచాయతీలో శతశాతం పన్ను వసూళ్లు కావాలని కమిషనర్ కె.అప్పలరాజు అన్నారు. నగర పంచాయతీలోని 2, 3, 7 సచివాలయాల్లో పన్నుల వసూళ్లను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి, నీటి, ఇంటి పన్ను త్వరితగతిన చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. శతశాతం వసూళ్లకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది డి.ఉమా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి పంచామృతాభిషేకం

విజయనగరం రూరల్: దుప్పాడ గ్రామంలో ఉన్న శ్రీక్షేత్రంలో నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుధవారం విద్యాలక్ష్మీ అమ్మవారికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనువాస్ వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలను నిర్వహించి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. ఉత్సవంలో దేవాలయం ఆస్థాన ధర్మకర్తలు దురాగ బాలాజీ, ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు.

నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు

● సిరిమానోత్సవం నేపథ్యంలో నీటి ఇబ్బంది లేకుండా కార్యాచరణ
● మూడు రక్షిత మంచినీటి పథకాల నుంచి నీరు పంపింగ్



అప్పారావు, డీఈఈ



నగరంలోని తాగు నీటి కుళాయి

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, సిరుల తల్లి, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే అమ్మవారి తొళ్లేళ్ల ఉత్సవం, సిరిమాను సంబరంతో పాటు మూడవ రోజు నిర్వహించుకునే కనుమ పండగ రోజు నగర ప్రజలకు అవసరమైన తాగు నీటిని నిరంతరం సరఫరా చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఏడాదికొకసారి నిర్వహించే జాతర మహోత్సవానికి నగర వాసులంతా తమ ఇంటి ఆడపిల్లలతో పాటు అల్లుళ్లు, మనములు, ఇతర బంధువులు, మిత్రులను పిలుచుకోవటం ఆనాధిగా వస్తున్న ఆనవాయితీ. ఈ నేపథ్యంలో నగర జనాభాకు అనుగుణంగా రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసే యంత్రాంగం జాతర మహోత్సవంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నారు. నగరంలోని 50 డివిజన్‌లలో విస్తరించి ఉన్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నట్లు అంచనా. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకాల నుంచి ప్రతి రోజు 27 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆ మొత్తాన్ని నగరంలోని 40 రిజర్వాయర్‌లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ద్వారా ఒక రోజు 25 డివిజన్‌లకు, మరో రోజు 25 డివిజన్‌లకు నీటిని అందిస్తున్నారు. ఇందులో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచి నీటి పథకాల వద్ద 8 బావుల నుంచి 17 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తుండగా.. ముషిడిపల్లి వద్ద ఉన్న 10 బావుల నుంచి మరో 10 ఎంఎల్‌డీ నీరు పంపింగ్ అవుతుంది. అయితే వీటి ద్వారా ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిరంతరాయంగా నీటిని పంపింగ్ చేయటంతో పాటు పంపింగ్ చేసిన నీటిని పబ్లిక్, వ్యక్తిగత కుళాయిల ద్వారా సరఫరా చేయనున్నారు. ఇదే విషయమై కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించి ప్రజలందరికీ నిరంతరాయంగా తాగు నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కుళాయిలు లేని ప్రాంతాలకు ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. సిరిమానోత్సవం వేళ నగర ప్రజలకు ఎటువంటి నీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలూ చేపట్టినట్లు చెప్పారు.

రైతు సంక్షేమానికి కృషి



మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజును సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు

డెంకాడ: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, దీనిలో భాగంగానే రైతు కుటుంబానికి చెందిన కర్రోతు బంగార్రాజును రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా నియమించారని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎన్ఆర్ఐ సాధికార, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి జిల్లాకు బుధవారం విచ్చేసిన కర్రోతు బంగార్రాజును టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాతవలస వద్ద ఏర్పాటు చేసిన అభినంద సభలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం, విశాఖ ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, భరత్, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కష్టపడి పని చేసిన వారికి తగిన గౌరవం దక్కుతుందన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజును ప్రజాప్రతినిధులు ఘనంగా ఘనంగా సన్మానించారు. అనంతరం మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతుల కష్టసుఖాలు తెలుసన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు సంక్షేమానికి నిరంతరం తన వంతుగా పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, భరత్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, పూసపాటి అదితి గజపతిరాజు, నడుకుదిటి ఈశ్వరరావు, గొండు శంకర్, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా నిర్మిస్తున్న 11 కేవీవీసీబీ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు బుధవారం తెలిపారు. రెల్లివలస, చల్లవానితోట, కొండగుడ్డి, కొండగుడ్డి ఏతపేట, మల్కాం, లక్ష్మీదేవితోట, శేరిపాలెం, బివి.కల్లాలు, బొర్రవానిపాలెం, కుమిలి పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల ఇంజినీరింగ్ అధికారిగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

నెల్లిమర్ల: మండల ఇంజినీరింగ్ అధికారిగా పి.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కురుపాం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ మండల ఇంజినీరింగ్ అధికారిగా పని చేసిన అశోక్ పెదబయలు మండలానికి బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన శ్రీనివాస్‌ను మండల అధికారులు అభినందించారు.

మద్యం దుకాణాలకు 218 దరఖాస్తులు



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

నెల్లిమర్ల: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వం నోటిఫై చేసిన 10 మద్యం దుకాణాలకు మొత్తం 218 దరఖాస్తులు అందినట్లు సీఐ ఎం.వెంకటరావు తెలిపారు. దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 11వరకు ప్రభుత్వం గడువు పెంచినట్లు చెప్పారు. ఆ రోజు సాయంత్రం ఏడు గంటల వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 14న లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో చండీయాగం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయిలు శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహించారు. అనంతరం యాగం విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

సరస్వతీదేవి అలంకరణలో దుర్గాదేవి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



విజయనగరం టౌన్: శ్రీ సరస్వతీదేవి అలంకరణలో వనంగుడిలో కొలువైన దుర్గాదేవి



విజయనగరం టౌన్: తమలపాకులు, పుస్తకాలు, పెన్నుల అలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారు భక్తులకు బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పైడితల్లిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవి బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని శ్రీ సరస్వతీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయిలు శాస్త్రోక్తంగా అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పసుపు, కుంకుమలను పైడితల్లి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు. గాజులరేగ సాలిపీధి మెయిన్‌రోడ్డులో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఏడో రోజు అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం పురస్కరించుకుని సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రదీప్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేకంగా తమలపాకులు, పుస్తకాలు, పెన్నులతో అలంకరించారు.

శ్రీకామాక్షి దేవాలయంలో చండీ మూలమంత్ర హోమం



విజయనగరం: కామాక్షి దేవాలయంలో చండీ మూలమంత్ర హోమం

విజయనగరం: బొండాడవీధిలో కొలువై ఉన్న శ్రీ మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి వారి దేవాలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం ఋత్వికులు వేదమంత్రాల సాక్షిగా చండీ మూలమంత్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలక మండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు మాట్లాడుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు పట్టణ పురవీధుల్లో మహిళ మండలి సభ్యులచే ఊరేగింపుగా అమ్మవారికి 108 రకాల పిండి వంటలతో సారె సమర్పించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నాగమల్లి లోకనాథ గణపతిరావు, కాకినాడ శోభూషణరావు, మందరపు వరహాచారి, నాగమల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి



శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి

విజయనగరం రూరల్: అందరి భాగస్వామ్యంతోనే పంచాయతీల్లో అభివృద్ధి శతశాతం సాధ్యపడుతుందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు బుధవారం నిర్వహించిన రెండు రోజుల శిక్షణనుద్దేశించి ఆయన మాట్లాడారు. శిక్షణలో పంచాయతీ విధులు, అధికారాలు, బాధ్యతలు, నిర్వహణ, విధివిధానాలు అభివృద్ధిలో భాగస్వామ్యం పాత్ర వంటి పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. వీటన్నింటిని బాగా నేర్చుకుని గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. గ్రామ స్వారాజ్య స్థాపనే ధ్యేయంగా ప్రతీ ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్టయితే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ఎంపీడీఓ చంద్రకళ మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీల్లో ముందుగా 12 పంచాయతీలకు సంబంధించిన వార్డు మెంబర్లు, ఉప సర్పంచులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిదులు ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని వాటిని గ్రామ అభివృద్ధికి కమిటీ తీర్మానాలు చేసి వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగలో...

పూసపాటిరేగ : గ్రామాలను అభివృద్ధి పథంలో పయనింపజేయాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వైస్ సర్పంచ్‌లకు పంచాయతీలు అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలలో నిధులు వినియోగం, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పంచాయతీ అధికారి జి.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ 15, 16వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ వినియోగంపై అవగాహన కల్పించారు.

ఆడపిల్లల పట్ల వివక్ష తగదు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

● డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష తగదని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు అన్నారు. అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డను కాపాడండి అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు బుధవారం అందజేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ వెల్లడించే స్కానింగ్ కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. స్కానింగ్ కేంద్రాలను ప్రోగ్రాం అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆడపిల్లల సంఖ్యను పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీపీఎన్‌డీటీ సభ్యుడు చదలవాడ ప్రసాద్, పద్మావతి, డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, డెమో చిన్నతల్లి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నూతన కార్యవర్గం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఉమాశంకర్



కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఉమాశంకర్‌ను సత్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో త్వరలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఉమాశంకర్ అన్నారు. జిల్లాలోని విజయనగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో బుధవారం ఆయన పర్యటించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున ఈలోగా పార్టీకి కొత్త జవసత్వాలు వచ్చేలా కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ఎన్నికలకు సన్నద్ధం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సరగడం రమేష్‌కుమార్, సతీష్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విస్తృత ప్రచారం



జెండా ఊపి ఆటోలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై విస్తత ప్రచారం నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద హెచ్ఐవీపై ప్రచారం నిర్వహించే ఆటోలను బుధవారం జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకూడదని తెలిపారు. హెచ్ఐవీ ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది, హెచ్ఐవీ సోకిన వారికి చికిత్స ఎక్కడ లభిస్తుంది.. రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించాలన్నారు. సత్ప్రవర్తన కల్గి ఉండడం ద్వారా హెచ్ఐవీ బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమా మహేశ్వరరావు, జిల్లా సూపర్‌వైజర్ సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాలను సందర్శించిన ఎయిర్ కమోడోర్

విజయనగరం అర్బన్: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పది రోజులుగా జరుగుతున్న కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వి.ఎం.రెడ్డి బుధవారం సందర్శించారు. క్యాంపు చివరి రోజులో భాగంగా జరుగుతున్న డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ పఠనం, ప్రథమ చికిత్స, ట్రెక్కింగ్, సమాజ సేవ వంటి కార్యక్రమాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడేట్స్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి తన జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని కోసం సమయాన్ని సమర్ధవంతంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. లక్ష్య సాధన కోసం కృషి చేయడం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు. భారత దేశ సైన్యంలో చేరాలనుకునే యువతకు అవసరమైన అర్హతలు, శిక్షణ మరియు సైన్యంలో చేరడానికి అనుసరించాల్సిన విధానాలపై స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చారు. సైన్యంలో చేరడానికి కావలసిన మానసిక మరియు శారీరక శక్తి గురించి, దేశ సేవకు అంకితభావం ఉన్న వారు ఎలా సైన్యంలో చేరవచ్చో వివరించారు. వివిధ పోటీల్లో విజయం సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వీఎం రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, సీతం కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ డివి.రామ్మూర్తి, క్యాంప్ కమాండెంట్ తపస్ మండల్, డిప్యూటీ కమాండెంట్ పల్లవి వర్మ, సుబేదార్ మేజర్ అనిల్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులైన మేజర్ శ్రీనివాసరావు, కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ కృష్ణ కిషోర్, లెఫ్టినెంట్ దినేష్, లెఫ్టినెంట్ లక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సతీష్, సీఎస్ఓ కె.సత్యనారాయణ, పీడీ మహేశ్వరరావు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.